## క్లుప్తంగా

### సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీలోని 22వ వార్డులో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు శనివారం భూమి పూజ చేశారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.8.54 లక్షలతో అంచనాలు రూపొందించామని చైర్మన్ చిట్టిబాబు తెలిపారు. నాణ్యతతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్లు దేవకుమారి, చనుమోలు నారాయణ, గోపాలరావు, మాజీ ఎంపీటీసీ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఆగిరిపల్లి: జాతీయ ఒలింపిక్ భారత్ వాలీబాల్ పోటీల్లో హీల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గుజరాత్ రాష్ట్రంలోని పాలాజ్ ఐఐటీ కళాశాల ఆవరణలో జరిగిన జాతీయ ప్రత్యేక ఒలింపిక్ వాలీబాల్ పోటీల్లో మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాలకు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థులు పి.వెంకటేశ్వర్లు, ఆర్.చిరంజీవి ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించారని హీల్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని లతా చౌదరి తెలిపారు. విద్యార్థులను హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, కార్యదర్శి తాతినేని లక్ష్మి అభినందించారు.

### లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రఘునాథరెడ్డి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ అధ్యక్షుడిగా రేగళ్ల రఘునాథరెడ్డి మరోసారి ఎన్నికయ్యారు. కొండపల్లి ఐలా కార్యాలయంలో సభ్యుల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేగళ్ల రఘునాథరెడ్డి, కార్యదర్శిగా ఎ.సురేష్, కోశాధికారి నర్రా శ్రీధర్ ఎన్నికయ్యారు. డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బి.కృష్ణారెడ్డి నూతన పాలకవర్గ సభ్యులను అభినందించారు. డీసీలు బుల్లిరాజు చౌదరి, సీహెచ్ వెంకటేశ్వరరావు, దీపక్ కుమార్, నాగిరెడ్డి, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకాలు, పెన్నుల వితరణ



తిరువూరు: ఎ.కొండూరు మండలం కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు శనివారం గ్రామానికి చెందిన అత్తునూరు వెంకటరెడ్డి నోట్ పుస్తకాలు, పెన్నులు వితరణగా ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రాంప్రదీప్, ఎస్ఎంసీ చైర్మన్ కె. రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బెల్టు షాపులపై దాడులు

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది శనివారం నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లోని బెల్టు షాపులపై దాడులు చేశారు. 75 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. సిద్దార్థ నగర్‌కు చెందిన బాణావతు జగపతి వద్ద 46 సీసాలు, మర్రిబంధానికి చెందిన ఎర్రపోతుల లక్ష్మణ వద్ద 9 సీసాలు, లంకపల్లి దుర్గారావు వద్ద 10 సీసాలు, వెలివల నాగరాజు వద్ద 10 సీసాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### డీపీఆర్‌టీయూ బడిబాట



తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల చేరిక తగ్గుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులే బడిబాట చేపట్టాలని డీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను సూచించారు. తిరువూరు పట్టణంలోని చింతలకాలనీ ఎంపీపీ స్కూల్‌లో శనివారం సాయంత్రం డీపీఆర్‌టీయూ బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. యూనియన్ రూపొందించిన కరపత్రాలను శ్రీను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. యూనియన్ నాయకులు లక్ష్మణరాజు, పీవీరావు, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ పాల్గొన్నారు.

# సురక్షితమేనా?

- పైప్‌లైన్ లీకేజీలతో తాగునీటి కాలుష్యం
- కలుషిత నీటితో వ్యాధుల భయం
- అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు
- స్పందించాలని గ్రామస్తుల వినతి



కేతనకొండ ఓసీ ఏరియాలో పగిలిన పైపునకు ప్లాస్టిక్ కవర్ కట్టినా లీకవుతున్న నీరు



కేతనకొండలో పైపులైన్ నుంచి లీకవుతున్న నీరు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): సమస్త జీవరాశులకు గాలి, నీరు ప్రాణాధారం. అవి స్వచ్ఛంగా ఉంటేనే జీవరాశులన్నీ ప్రశాంతగా, ఆరోగ్యకరంగా జీవిస్తాయి. మండల పరిధిలోని కేతనకొండ గ్రామంలో కలుషిత తాగునీరు సరఫరా జరుగుతోంది. ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్లు పగిలి నెలలు గడుస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. తాగునీటి కాలుష్యం ఏర్పడి ప్రజలు డయేరియా, చర్మ సంబంధిత వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. ప్రజారోగ్యం దృష్ట్యా పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

**గ్రామంలో రెండు విధాలుగా నీటి సరఫరా..**

కేతనకొండ గ్రామ ప్రజలకు రెండు విధాలుగా నీటిని గ్రామ పంచాయతీ అధికారులు సరఫరా చేస్తున్నారు. కొటికలపూడి గ్రామం సమీపంలో కృష్ణానది పాయలో బోరు పంపు ఏర్పాటు చేసి పైపుల ద్వారా పంచాయతీ ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు ఎక్కిస్తారు. అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా కుళాయిల నుంచి నీటిని ప్రజలకు అందిస్తారు. రెండో విధానంలో ఇబ్రహీంపట్నంలోని గ్రామీణ తాగునీటి సరఫరా పథకం నుంచి ఫిల్టర్ చేసిన కృష్ణా జలాలను పైపుల ద్వారా పంపిణీ చేస్తారు. గ్రామంలో అంతర్గత పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడటం, కొన్ని ప్రాంతాల్లో పగిలి పోవడంతో తాగునీరు వృథా అవడంతో పాటు కలుషితం అవుతున్నాయి.

**కలుషిత నీటితో వ్యాధుల భయం**

గ్రామంలో అనేక ప్రాంతాల్లో తాగునీటి పైపులు పగిలిపోవడం వలన తాగునీరు కలుషితం అవుతోంది. అంతర్గత పైపులు కొన్ని చోట్ల పగిలిపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. లీకేజీల నుంచి పైకి ఎగసిపడుతున్న నీరు వృథా అవుతోంది. లీకేజీలు ఏర్పడిన పైపుల్లోకి వ్యర్థ పదార్థాలు, క్రిములు చేరి బ్యాక్టీరియాను ఉత్పత్తి చేసి తాగునీటి కాలుష్యం ఏర్పడుతోంది. కలుషిత నీరు తాగడం వలన డయేరియా, చర్మ సంబంధిత వ్యాధులు పొంచి ఉన్నాయనే భయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**నూతన పైప్‌లైన్ల ఏర్పాటుకు కృషి**

గ్రామంలో దీర్ఘకాలంగా ఫ్లోరైడ్ నీరు సరఫరా కావడంతో పైప్‌లైన్‌లో బ్లాక్‌లు ఏర్పడ్డాయి. పైప్‌లు ఏర్పాటు చేసి చాలాకాలం కావడంతో కొన్నిచోట్ల తుప్పుపట్టి లీకేజీలు ఏర్పడ్డాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నాం. అవసరమైతే మండల పరిషత్ నుంచి నిధులు సేకరించి నూతన పైప్‌లైన్ నిర్మాణం చేపడతాం.

– మౌనిక, గ్రామ పంచాయతీ కార్యదర్శి, కేతనకొండ

**పైప్‌లైన్లపై అధికారుల నిర్లక్ష్యం**



గ్రామంలో పైపులైన్లు పగిలి తాగునీరు వృథా అవుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పైప్‌లైన్లు పగిలి సుమారు మూడు నెలలు దాటినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో ఎక్కువగా వాడుక నీరు సరఫరా చేసే పైపులు పగిలి లీకేజీలు ఏర్పడ్డాయి. తాగునీటి పైపులు కొంతమేర బాగున్నప్పటికీ ఆ నీరు రాని సమయాల్లో వాడుక నీటినే స్థానికులు వినియోగించి అనారోగ్యానికి గురవుతున్నారు. నీటి సరఫరాపై పంచాయతీ పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పగిలిన, లీకేజీలు ఉన్న పైపులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# యోగాతో మెరుగైన ఆరోగ్యం



కొత్తరావిచర్లలో యోగా సాధన చేస్తున్న సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, ఎంపీడీఓ తదితరులు





మైలవరం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న డీపీఓ లావణ్య, అధికారులు, సిబ్బంది



తిరువూరులో యోగాసనాలు వేస్తున్న ఆర్డీఓ, అధికారులు

మైలవరం: ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు యోగా అద్భుతమైన సాధనం అని డీపీఓ పి. లావణ్య అన్నారు. ప్రపంచ యోగా డే సందర్భంగా మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో డీపీఓ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు నాటారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మైలవరం మండలంలోని పలు ప్రాంతాల్లో యోగా డే నిర్వహించారు.

**ఒత్తిడిని దూరం చేసే యోగా**

తిరువూరు: నిత్యం యోగాసనాలు వేయడం వలన మానసిక ఒత్తిడి దూరమవుతుందని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆర్డీఓ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు యోగాసనాలు వేశారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఏ కాలనీలో ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఎన్టీటీసీ కల్యాణ మండపంలో ఏపీఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ వర్మ, ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి, కమాండెంట్ శంకరరావు పర్యవేక్షణలో యోగా సాధన చేశారు. మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన ఆధ్వర్యంలో పవిత్ర సంగమం వద్ద యోగా కార్యక్రమం జరిగింది.

**యోగా సర్వరోగ నివారిణి**

నూజివీడు: యోగా అనేది సర్వరోగ నివారిణి అని, దీనిని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కొత్తరావిచర్లలో యోగా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సబ్ కలెక్టర్, ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, తహసీల్దార్ గుగులోతు భద్రూనాయక్, సర్పంచి కాపా శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు యోగా సాధన చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి నేతృత్వంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

### అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో పెను ప్రమాదం పొంచి ఉంది. జి.కొండూరు శివారులోని 30వ నంబరు జాతీయ రహదారికి సమీపంలో ఆత్కూరు రోడ్డు పక్కన నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభానికి తీగజాతి పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. ఇవి ఎగబాకి పైన ఉన్న ప్రధాన విద్యుత్ లైన్ వరకు వెళ్లాయి. నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించకపోతే పిచ్చి తీగలకు విద్యుత్ సరఫరా అయి పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. – జి. కొండూరు

## నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే భవిత



మాట్లాడుతున్న గోపాల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వంటి అధునాతన సాంకేతిక అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీసీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ బీవీఎస్ఎస్ఎస్ గోపాల్ అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇండస్ట్రీ ఇంటరాక్షన్ అండ్ కెరీర్ పాత్ వే గైడెన్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ పరిశ్రమల పనితీరు, ఉద్యోగ అవకాశాలు, మార్కెట్ డిమాండ్స్, భవిష్యత్ కెరీర్ అవకాశాల గురించి విలువైన సూచనలు చేశారు. సాఫ్ట్‌వేర్ రంగం నిత్యం ఆధునికీకరణ చెందుతోందని తెలిపారు. కాలంతో వేగంగా పోటీపడినప్పుడే సరికొత్త నైపుణ్యాలు సాధించగలుగుతామన్నారు. సాఫ్ట్‌వేర్ కెరీర్ ప్రతి క్షణం సవాళ్లతో కూడుకుంటుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ కమిటీ ఏట డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ వీటీ రాంపవన్, పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బాలికల కళాశాలను సద్వినియోగం చేసుకోండి

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కె.హేమమాధవి శనివారం కోరారు. విద్యార్థులకు ఉచితంగా ఇంటర్మీడియెట్ విద్య నందించడంతోపాటు యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు అందజేస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం వర్తిస్తుందన్నారు. ఐఐటీ, ఎంసెట్ బుక్స్ అందజేస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు తమ బాలికలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కోరారు.

### రేపు పాత వాహనాలకు వేలం

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన 30 వాహనాలకు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు ముందుగా ధరావతు చెల్లించాలన్నారు. వేలంలో పాడిన ధరకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 94409 02462, 99890 52012 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### ఆలయాల్లో విశేష పూజలు



తిరువూరు: జ్యేష్ఠ బహుళ ఏకాదశి సందర్భంగా తిరువూరు మండలంలోని పలు దేవాలయాల్లో శనివారం విశేష పూజలు జరిగాయి. రోలుపడి శివారు గోకుల్ నగర్‌లోని సంతాన వేణుగోపాల స్వామి దేవాలయం ప్రతిష్ఠ జరిగిన 16 రోజులు పూర్తయిన సందర్భంగా జరిగిన పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజల్లో ఆలయ ధర్మకర్త రాచబంటి వెంకటాద్రి, అర్చకులు ఈశ్వరప్రగడ విజయకుమార్ పాల్గొన్నారు. వేంకటాచలస్వామి దేవాలయంలో విష్ణు సహస్రనామ పారాయణం, రాజుపేట వీరాంజనేయ స్వామికి లక్ష మల్లెల పూజ నిర్వహించారు.

### విద్యార్థులకు భోజనం ప్లేట్ల వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): హరివిల్లు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్లోని విద్యార్థులకు శనివారం భోజనం ప్లేట్లను వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రసిక్ సంఘ్వీ మాట్లాడుతూ ఫౌండేషన్ నిర్వాహకులు గత నాలుగు సంవత్సరాల నుంచి చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించే నిమిత్తం దాదాపు 300 స్టీల్ ప్లేట్లు అందజేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.శశికాంత్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేందుకు సరిపడా ప్లేట్లు లేవని ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. వెంటనే తమ ఫౌండేషన్ ద్వారా భోజనం ప్లేట్లు పంపిణీ చేశామని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్‌కుమార్, సహాయ కార్యదర్శి యు. కనకారావు, సభ్యులు మానేపల్లి రామకృష్ణ, సాయి అఖిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుడి కక్కుర్తి

**పరిహారం పొందిన భూమిలోనే మట్టి తవ్వకాలు**



గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం మార్కింగ్ చేసిన భూమిలో మట్టిని తవ్విన ప్రదేశం

జి.కొండూరు: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూమిని ఇచ్చిన టీడీపీ నాయకుడు అందుకు గానూ రూ.కోటి వరకు పరిహారం పొందాడు. అయినా ఆశ చావలేదు. అదే భూమిలోని మట్టిని తవ్వి తన పొలంలో మెరక చేసుకుంటున్న ఘటన జి.కొండూరు మండల పరిధి కవులూరులో శనివారం ఉదయం జరిగింది. కవులూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు నాగపూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూమిని ఇచ్చాడు. ఇటీవల హైవే నిర్మాణానికి మార్కింగ్‌ను సైతం చేశారు. హైవే నిర్మాణ పనులకు సమయం ఉండడంతో సదరు టీడీపీ నాయకుడు మార్కింగ్ చేసిన భూమిలోని మట్టిని తవ్వి పక్కనే ఉన్న తన భూమిని మెరక చేసేందుకు శనివారం ఉదయం పొక్లెయిన్‌తో తవ్వి ట్రాక్టర్లతో మట్టిని తరలించడం ప్రారంభించాడు. స్థానికుల సమాచారం మేరకు మీడియా అక్కడికి వస్తుందని భావించి వెంటనే అక్కడి నుంచి ఉడాయించాడు. అప్పటికే వందకుపైగా ట్రాక్టరు ట్రక్కుల మట్టిని తరలించినట్లు తెలుస్తుంది.

# ఆయిల్ ట్యాంకర్ లారీ దగ్ధం



కట్టుబడిపాలెం హెచ్‌పీసీఎల్ కంపెనీ వద్ద దగ్ధమైన ఆయిల్ ట్యాంకర్ లారీ

జి.కొండూరు: బ్యాటరీలో సమస్య తలెత్తి మంటలు చెలరేగడంతో ఆయిల్ ట్యాంకర్ లారీ దగ్ధమైంది. ఈ ఘటన జి.కొండూరు మండల పరిధి కట్టుబడిపాలెం వద్ద జరిగింది. ఇటీవల షోరూం నుంచి తీసుకొచ్చిన లారీకి విజయవాడ ఆటోనగర్‌లో ఆయిల్ ట్యాంకర్‌ను తయారు చేయించుకొని ఈ నెల 19న అర్ధరాత్రి సమయంలో డ్రైవర్ శివరామకృష్ణ జి.కొండూరు వైపు తీసుకొస్తున్నాడు. జి.కొండూరు మండల పరిధి కట్టుబడిపాలెం హెచ్‌పీసీఎల్ కంపెనీ వద్దకు రాగానే లారీ బ్యాటరీలో సమస్య తలెత్తి పొగలు రావడం ప్రారంభమయ్యాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తమైనప్పటికీ మంటలు చెలరేగడంతో స్థానిక పోలీసులు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు. పక్కనే ఆయిల్, గ్యాస్ స్టాక్ పాయింట్లు ఉండటంతో పెనుప్రమాదం జరగకుండా సకాలంలో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే లారీ క్యాబిన్ మొత్తం కాలిపోయింది. లారీ గొల్లపూడికి చెందినది అయినప్పటికీ లారీ డ్రైవర్ శివరామకృష్ణ జి.కొండూరుకు చెందిన వ్యక్తి కావడంతో పాటు తర్వాత రోజు శుక్రవారం కాకినాడ లోడింగ్ కోసం వెళ్లాల్సి ఉండటంతో లారీని జి.కొండూరు తీసుకొస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ తెలిపారు.

# వైఎస్సార్ సీపీ నాయకులకు పరామర్శ



వైస్ ఎంపీపీ సాంబశివరావును పరామర్శిస్తున్న ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: చొప్పరమెట్లలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వైస్ ఎంపీపీ గెడ్డం సాంబశివరావును పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఆరేపల్లి చిన్న రంగారావును, ప్రమాదంలో గాయపడిన పామర్తి తిరుపతిరావు కుమారుడిని పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో ఇటీవల మరణించిన పల్లగాని వీరబాబు తండ్రి గోపాలరావును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, ఈలప్రోలు సుబ్బయ్య, జ్యోతి సుజనా కుమారి, వాకా సక్కేశ్వరరావు, ఉప సర్పంచ్ కత్తిక శీను, కారుకొండ బాబు, గెడ్డం రంగారావు, రవిశేఖర్, కంబాల ప్రదీప్ పాల్గొన్నారు.

# విత్తన దుకాణాల్లో తనిఖీలు



విత్తన దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లను పరిశీలిస్తున్న ఏడీఏ భవాని

వత్సవాయి : మండలంలో మిర్చి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్న వైనంపై ఈనెల 19న 'సాక్షి' దినపత్రికలో 'మంటెత్తిస్తున్న మిర్చి విత్తన ధరలు' శీర్షికన ప్రచురించిన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. జగ్గయ్యపేట ఏడీఏ భవానీ శనివారం వత్సవాయిలోని విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, రశీదు పుస్తకాలు, ఇన్వాయిస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ భవానీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక రేట్లకు విత్తనాలను అమ్మితే చర్యలు తీసుకుంటామని ఆయా దుకాణాల యజమానులను హెచ్చరించారు. పత్తి విత్తన ప్యాకెట్ ఎమ్మార్పీ ధర రూ.901 ఉన్నందున అదే ధరకు విక్రయించాలని స్పష్టం చేశారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే ఆయా షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జగ్గయ్యపేట టెక్నికల్ ఏఓ వి.రవికుమార్, వత్సవాయి ఏఓ జి.సత్యనారాయణ, సిబ్బంది రాకేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కల్పించాలి

పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య కార్మికులకు జీవిత భద్రత కల్పించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుదే రాజా అన్నారు. యోగా డే కార్యక్రమం సందర్భంగా శనివారం ఉదయం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న 47వ డివిజన్ కార్మికురాలు ముత్యాల సింహాచలంపై ఎల్ఈడీ స్క్రీన్ పడి గాయాలపాలై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను యూనియన్ సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్‌తో కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగి గాయపడిన లేదా చనిపోయిన వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అరకొర సహాయం ఏళ్లు గడుస్తున్నా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### యువతకు బ్యాంకింగ్‌పై అవగాహన ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): యువత బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొసిరెడ్డి వీర్రాజు అన్నారు. పటమట బెంజిసర్కిల్ వద్ద ఉన్న కళాశాల ప్రాంగణంలో ఆర్బీఐ, తెనాలికి చెందిన సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ(ఆర్డిడ్స్) ఆధ్వర్యంలో విద్యార్థులకు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో మోసాల పట్ల అప్రమత్తత అవసరమని తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాలు, ఖాతాల నిర్వహణ, పొదుపు అలవాట్ల గురించి ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎస్.కలహస్తి, బ్యాంక్ మాజీ మేనేజర్ కేసీహెచ్ కోటేశ్వరరావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్డిడ్స్ ప్రతినిధి బి.భిక్ష మాట్లాడారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.